# విన్నారా!
# స్వరాజ్య సన్నాహాలు

★

స్వరాజ్య వుత్సవ సందర్భంలో మొన్న నేను ఢిల్లీ వెళ్లడం తటస్థించింది. అక్కడ సి. ఐ. డి. లో పెద్ద వుద్యోగం చేస్తున్న ఒక మిత్రుణ్ణి చూడ్డానికి వెళ్ళేను వాళ్ళ ఆఫీసుకి.

స్వరాజ్య మహోత్సవాలగురించి మాట్లాడుకొంటూ వుండగా నా మిత్రుడు తన డ్రాయరులోనుండి ఒక ఫైలుతీసి "నీకోరహస్యమైన ఫైలు చూపిస్తాను. దానిలోని సంగతులు బయట పెట్టవుకదా" అన్నాడు. సరేనని ఆ ఫైలు అందుకున్నా, దానిమీద 'Confidential' అని ఎర్రటి అక్షరాలతో రాసివుంది. ఆ ఫైలులోని విషయాలు స్వరాజ్యంకోసం వుబలాటపడిన వాళ్ళందరూ తెలుసుకోవలసిన విషయాలు కాబట్టి నా మిత్రుడికిచ్చిన మాటతప్పి, బయటపెడుతున్నా.

ఆగస్టు 15 వ తేదీని ఇండియాకు స్వరాజ్యం యిచ్చేస్తామని బ్రిటిష్ప్రభుత్వం ప్రకటించిన వెంటనే. ఇండియాలోని ప్రజలు స్వరాజ్యాన్ని స్వీకరించడానికి యేం సన్నాహాలు చేస్తున్నారో రిపోర్టు చెయ్యవలసిందని ఇండియా ప్రభుత్వం సి. ఐ. డి. వాళ్ళని దేశంమీదికి పంపిందట. ప్రభుత్వానికి అందిన సి. ఐ. డి. రిపోర్టుల సారాంశం యిక్కడ వివరిస్తున్నా:

స్వరాజ్యం రానే వచ్చింది గనుక యిక సత్యాహింసలతో మనకి పనిలేదని వాటికి తిలోదకాలు వదలడానికి పురోహితుల్ని చూసుకుంటున్నారట కాంగ్రెసు గోత్రీకులు

పాకిస్తాన్ యుద్ధంలో బాకులు బాగా పని చేసాయి గనుక వాటి పదును పోనివ్వకూడదని పానపడుతున్నారట ముస్లింభాయీలు.

పాకిస్తాన్ యుద్ధంలో పూర్తిగా వోడిపోయినందున హిందూమహాసభవారు రాజకీయ సన్యాసం పుచ్చుకుని హిమాలయాపర్వతాలకి తపస్సుకి పోతున్నారట. దేశంఅంతా మ్లేచ్ఛమయం అయిపోయిందనీ, నిసలైన హిందూమతం ఆ పర్వతాల్లోనే దొరుకుతుందనీ వీరి నమ్మకమట,

వ్యాపారస్తులు, పెట్టుబడిదారులూ మంచి హుషారుగా వున్నారట, కాంగ్రెసుని బుట్టలో వేసుకున్నాం కదా, యిక రాబోయే హయాం అంతా తమదేనని, యుద్ధంలో నిండగా మిగిలిన యినప్పెట్టెలకు బూజు దులిపిస్తున్నారట.

ఇంతవరకూ అజ్ఞాతంలో వుండవలసివచ్చిన బ్లాక్మార్కెట్ దారులంతా, ఆగస్టు 15 తర్వాత నడిబజారులో బహిరంగంగా 'బ్లాక్' దుకాణాలు తెరవడానికి సన్నాహంచేస్తున్నారట.

స్వరాజ్యం వచ్చింతర్వాత తమకు పురుషులతో సమానహక్కులు వాటంతట అవే వచ్చేస్తాయి గనుక పురుషుల్నికూడా వంటగదుల్లోకి దూర్చడానికి సన్నాహాలు. పురుషులుకూడా

"తాతాజీ"

పిల్లల్ని కనేలాగు చెయ్యడానికి శాస్త్ర పరిశోధనలు, చేస్తున్నారట స్త్రీలు, ఆగస్టు 15 వ తేదీని దేశంలోని స్త్రీలంతా వంటగదుల్లోనూ, పడకగదుల్లోనూ "Stay in stike" చెయ్యడానికి రహస్యంగా సన్నాహాలు జరుగుతున్నాయట.

స్వరాజ్యం వచ్చింతర్వాత పరీక్షలంటూ వుండవు కాబట్టి దేశంలో వున్న text-books అన్నిటినీ 15 వ తేదీని 'bon—fire' చెయ్యాలని విద్యార్థులు తీర్మానించుకున్నారట.

ఇక ఇంగ్లీషుప్రభుత్వం వుండదు కాబట్టి 'క్లాసు రూమ్సు'లో రాజద్రోహపు వుపన్యాసాలిచ్చి యింగ్లీషువాడిమీద కసి దీర్చుకోవాలని వుపాధ్యాయులు ఆలోచిస్తున్నారట.

స్వరాజ్యం వచ్చేక పరిశ్రమలు, కర్మాగారాలు తమ అధీనంలోకి వచ్చేస్తాయనీ, యెదురు మాట్లాడిన బూర్జువాలని నిలుచున్నపాటున కాల్చేస్తా'మనీ ఇండియన్ ప్రోలిటేరియనులు వుబలాటపడుతున్నారట.

స్వరాజ్యంవచ్చింతర్వాత 'సెన్సార్ బోర్డులు' తీసేస్తారు గనుక యెంత అసభ్య ఫిల్ములైనా తీసి తమ కళావిశిష్టతను ప్రదర్శించడానికి ఫిల్ము డైరెక్టర్లు సన్నాహం చేస్తున్నారట.

ఇపుడు పలుకుబడిలోవున్న రాజకీయ నాయకులంతా తమ పత్రికలవల్లనే పైకి వచ్చారుకాబట్టి, యికనుండి మేం చెప్పినట్లు వినకపోతే మట్టిలో కలిపేస్తామని పత్రికాధిపతులు నాయకుల్ని, మంత్రుల్ని బెదిరిస్తున్నారట.

తలిదండ్రుల అభ్యంతరాలవల్ల తమ ప్రియుల్ని కలుసుకోలేకపోతున్న యువతులంతా ఆగస్టు 14-15 వ తేదీ అర్ధరాత్రి ప్రియులతో లేచిపోవటానికి సన్నాహాలు చేసుకుంటున్నారట.

ఈ రిపోర్టులు రాగానే ఇండియాప్రభుత్వం తగిన బందోబస్తు చేసిందట. అంచేతనే ఆ రిపోర్టులోని కొన్ని సంఘటనలు 5 వ తేదీని జరగలేదని నా సి. ఐ. డి. మిత్రుడు సంజాయిషీ చెపుతున్నాడు.





బిటా కేఫిన్
(తలనొప్పి బిళ్ళలు)

అన్ని నొప్పులను జ్వరములను కుదుర్చును.
తలనొప్పి, పంటినొప్పి, కాళ్ళ నొప్పులు, కీళ్ళనొప్పులు, నిద్రలేకుండుట, స్త్రీల బహిష్టు నొప్పులు, అలసట, మలేరియా, వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడుకొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు 1 అణా

అన్ని మందుల షాపులలోను లభ్యమగును

Stockists:
Messrs, Dadna & Co., P. T., Madras.
Manufacturers:
**BOMBAY TABLET MFG. CO.**
P. O. Box No. 2092, BOMBAY. 2


# వ్యత్యాసాలు

"రామం"

★

నాయకుడ నేను—వర్కరు నీవు.

శాసించుట నావంతూ — చేయుచుండుట నీ వంతు.

ఆదేశించుట నా వంతూ — అనుసరించుట నీ వంతు,

సౌఖ్యము పొందుట నావంతూ — కష్టము పొందుట నీ వంతు.

"సత్యాగ్రహి" నామము నా వంతు—హింసలు పొందుట నీ వంతు.

"ఎ" క్లాసు నావంతు—'సి' క్లాసు నీ వంతు.

సన్మానములు బ్రహ్మరథములు నావంతు—సన్మానించుట రథములు లాగుట నీ వంతు.

M. L. C. లు M. L. A. లు నావంతు—జైలురోగములు నీ వంతు,

మంత్రిపదవులు నావంతు— మెదలకుండుటే నీ వంతు.

జీతభత్యములు నావంతు — లేమిడిభత్యం నీ వంతు.

చదువులు సంధ్యలు నాకేలా?—చాలిన చదువులు నీ కేవీ?

అడిగినదల్లా నా వంతు—అడుగకుండుటే నీ వంతు.

అజీర్ణరోగం నావంతు-ఆకలిరోగం నీవంతు.

దుడ్డుల సౌఖ్యం నావంతు—బిడ్డలసౌఖ్యం నీ వంతు.

దేశముకొరకై 'నా' సృష్టి—నా కొరకేగా 'నీ' సృష్టి.

సర్వసౌఖ్యములు నా కొరకు — అష్టకష్టములు నీ కొరకు.

దేశము సర్వము నా కొరకు—దేబిరితనమే నీ కొరకు.

నాయకు డగుటే నాకర్మ—వర్కరువగుటే నీ ఖర్మ.